అమ్మాయిల శీలంతో
చెలగాటమాడే
అతనికి ఆమె
ఎలా బుద్ధిచెప్పింది?

# మానవ మృగం

రాజు గౌడ్
కథ

చివరి విషయం రాసి పెన్ను పక్కన పడేశాడు విక్రమ్. ఒకసారి డైరీలోని పేజీల ను మొదటినుండి చివరిదాకా తిరగేశాడు.

అందులో ఎందరో ఆడపిల్లల జీవితాలు చరిత్రలుగా వున్నాయి. అతను ఎవరెవరిని ప్రేమించిందీ... ఎక్కడెక్కడ విహరించి, చివరకు వాళ్లని తీసుకెళ్లి ఎక్కడ అమ్మేసుకున్నదీ అంతా విపులంగా రాసి వుందందులో.

ఒక పని ముగించాక దానిని తాను సాధించిన విజయంగా సూచిస్తూ విషయాన్ని డైరీలో రాసుకోవడం విక్రమ్‌కు మొదటి నుండి అలవాటు.

సిగరెట్ వెలిగించాడు. తనకెదురుగా టీపాయ్ మీదవున్న నోట్లకట్టకేసి చూశాడు. చీకటి సామ్రాజ్యంలో ఒక అమాయకపు ఆడపిల్ల విలువనుసూచిస్తున్నట్లుగా వుందది.

అంతకుముందురోజు అతను మద్రాసులో అమ్మేసి వచ్చిన అమ్మాయి తాలూకు పన్నెండువేల నోట్లకట్ట అది.

అతనికి తెలుసు — తను చేస్తున్నది ఎంత నీచమైన పనో? కానీ... అతనికి అలా ఎప్పుడూ అనిపించలేదు.

నటనతో మజ్ను ప్రేమను మరిపించి... కౌగిలిలో మన్మథుని రాసలీలలు కురిపించి.. ప్రేమ ఊబిలో పూడ్చేసి — కర్కోటకుడిగా ... నయవంచకుడిగా వాళ్ల ఆశలన్నీ తుంచేసి భవిష్యత్తును తుడ్చేసి కర్కశంగా వేశ్యాగృహంలో వాళ్లని అమ్మేసి వస్తున్నప్పుడు నన్ను దగా చేయకు విక్రమ్... అని వాళ్లు కన్నీళ్లతో కాళ్లు పట్టుకుని అర్థించినా అతని హృదయం ఎప్పుడూ కరిగిపోలేదు... కరుణా



మయుడిలా చలించనూలేదు!

ఆడపిల్లల జీవితాలను పావులుగా చేసుకుని 'ప్రేమ' అనే చదరంగంమీద ఆడుతున్న అతని కసాయి ఆట ముక్కలై తనో గంజాయి మొక్కనని సమాజానికి తెలిస్తే ప్రజలు తనని కాకుల్లా, రాబందుల్లా పొడుచుకు తింటారని తెలిసి అతనెప్పుడూ భయపడలేదు.

అతని దృష్టిలో అదో నేర ప్రవృత్తి కాదు. వృత్తి! అదో గేమ్... అదోరకమైన ఎంజాయ్! ఆ ఎంజాయ్ లో ఎంతో సంపాద న సంపాదించగలిగాడతను.

సాలోచనగా నిట్టూర్చాడు విక్రమ్. వి స్కీ బాటిల్ ఓపెన్‌చేసి గ్లాసులో వంచుకు న్నాడు.

ఓమారు గ్లాసు ఎత్తి విస్కీవంక చూశా డు. తను కురిపించే కపట ప్రేమలో కూరుకుపోయిన అమాయకపు ఆడపిల్లలా అందంగా కనిపించింది.

అతనిలో చిరునవ్వు.

అమ్మాయిని ముచ్చటగా ముద్దుపెట్టుకు నేంత మురిపెంగా తాగేసేవాడే ఒక్క గుక్కలో దాన్ని! సిప్ చేయబోతూ ఆగాడు క్షణం. ఎదురుగా గుమ్మంలోంచి వస్తున్న ఆమెని చూసి.

గుర్తుపట్టాడు. సాధన... రెండు సంవ త్సరాల క్రితం అతను బొంబాయిలో అమ్మేసి వచ్చిన సాధన.

ఆమె అక్కడినుంచి ఎలా వచ్చిందో, అతని వద్దకు ఎందుకు వస్తుందో క్షణం అర్థంకాలేదు విక్రమ్‌కు.

అతను చూస్తుండగానే వచ్చి, భుజానికి వేలాడుతున్న బ్యాగ్‌ని సోఫాలో పడేసి నీరసం గా కూలబడింది రిలీఫ్‌గా!

విస్కీ సిప్ చేస్తూ ఆమెకేసి చూశాడు విక్రమ్.

"హాయ్ .." చనువుగా పలకరించింది. సమాధానంగా నవ్వును ముఖంమీద పులుము కున్నాడు విక్రమ్.

"ష్... జర్నీలో వళ్లు హూనమైపోయిం ది. బాత్రూంలో పంపువస్తుందా విక్రమ్?" అడుగుతూనే అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా బాత్రూంలోకెళ్లిపోయి ంది.

తేలిగ్గా ఊపిరి పీల్చాడు విక్రమ్ — రాగానే, ఆమెను మోసం చేసినందుకు మీద విరుచుకుపడి నానా రభస చేస్తుందేమో అనుకున్నాడు. కాని సాధనలో ఎలాంటి ఉద్రేకపు భావాలు కనపడక పెరిగిన టెన్షన్ తగ్గింది.

విక్రమ్ ఆలోచనల్లో వుండగానే స్నానం ముగించి వచ్చింది సాధన. ఆమెను చూస్తూ నే అతని మనసు బిటారుగా అయింది. రెప్పవేయడంకూడా మరిచాడు. నైటీ చాటు న ఆశ్చాదన లేని ఆమె విద్యుత్ కాంతిలో విశ్వమోహినిలా మోహనంగా అనిపించింది.

వస్తూనే అతని ప్రక్కన కూలబడింది. అతను ఖాళీ చేసిన గ్లాసును తీసుకుని విస్కీ నింపుకుంది. రెండు పెగ్గులు వరుసగా లాగించింది. ఆశ్చర్యపోలేదు విక్రమ్ — అడ్డదారిలోదిగిన ఆడదానికి 'అది అలవాటే' అనుకున్నాడు.

"ఏమిటలా అయిపోయావ్... ఎలా వచ్చావని ఆశ్చర్యపోతున్నావా విక్రమ్? మన ను నీవైపు మళ్లి పారిపోయి వద్దామనుకున్నా ను. కానీ వాళ్లే పంపించారు — నా ప్రవర్తనకు మెచ్చి!" అతడినే గమనించిన ఆమె అంది.

అది వ్యంగ్యమో కాదో అర్థంకాలేదు విక్రమ్‌కు. స్వప్నంలో వున్నట్టుగా నైటీ చాటున చూస్తుండిపోయాడు. అదేం పట్టిం చుకోలేదు సాధన. మరో రెండు పెగ్గులు లాగించింది.

"మీ ఆవిడ అలికిడి వినబడడంలేదు.

వూరికిగాని వెళ్లిందా?" నింపాదిగా అడిగింది.

"నేనింకా పెళ్లి చేసుకోలేదు సాధనా!"

విక్రమ్ మాటలు ఆమెకు వినబడ్డాయో లేదోగాని, దాహం తీరనట్టు మరో రెండు పెగ్గులునీట్‌గా లాగించింది. అప్పుడుగాని ఆమె మనసు తేలిక పడి దేహం గాలిలో తేలిపోతున్న దూదిపింజంలా అనిపించింది.

సాధనతోపాటు విక్రమ్‌కూడా పుచ్చుకున్నాడు. మైకం కమ్మేసిన కళ్లకు ఆమె అప్సరసలా అనిపించింది అతనికి. సాధన అభ్యంతరం చెప్పలేదు.

లైటు ఆర్పితే... చెదిరిన వెలుతురులో, కమ్ముకున్న చీకటిలో ఇద్దరిమధ్యన తొక్కిసలాట మొదలయింది.

○ ● ○

"ఏమిటే... ప్రొద్దున్నే హడావిడిగా మేకప్ అవుతున్నావ్?" మేకప్ అవుతున్న సాధనని ఆశ్చర్యంగా అడిగాడు విక్రమ్.

"వెళ్లిపోదామని"

"ఏమిటి అప్పుడే?" అతనిలో ఆశ్చర్యం తొంగిచూడలేదు. వ్యంగ్యం కనబడింది.

"ఏ... ఈ రాత్రికి వుండమంటావా?" ఆమెలో కవ్వింపు కనబడలేదు. ఓరగా చూసింది అతడ్ని.

"నీకు మనసుపడితే నాకు అభ్యంతరం లేదు సాధనా" రాత్రి తాలూకు అనుభవం నెమరేసుకుంటూ పరోక్షంగా అన్నాడు.

అతనిలో అదో రకమైన చిరుదరహాసం. కళ్లలో పొగరు, మాటల్లోని అహంకారం స్పష్టంగాకాకపోయినా కనబడుతూనేవుంది. ఆమెకు — నివురుకప్పిన నిప్పులా!

"కాని... మీ ఆవిడ వస్తుందేమో!"

అతనికి ఇంకా పెళ్లికాలేదని తెలిసికూడా అతని మనోభావాన్ని తెలుసుకోనేందుకు కావాలని అడిగింది.

విక్రమ్ నవ్వేడు. "రాత్రే చెప్పాను సాధనా నీకు — ఇంకా నాకు పెళ్లికాలేదని"

"ఏ... ఎందుకు చేసుకోలేదు? నీ


## అలవాటు

"ఒరే! ప్చ్... నాకు నిద్రలో నడిచే అలవాటు ఎంతకీ పోవడంలేదురా!"

"నాతో పోల్చుకుంటే నీది చాలా చిన్న సమస్యరా, నేనైతే నడుస్తూ నిద్రోతుంటాను!"

"హా!!!"

— పెనుమాక దేవానంద్ (ధర్మవరం)



వ్యక్తిగతం తెలుసుకుని అసహ్యించుకున్నారా?–'' ఆమె మాటల్లోని ఎత్తిపొడుపును గ్రహించాడతను.

''నాకా అవసరం ఏర్పడలేదు సాధనా. ఎందుకంటే ఆజ్ఞను జారీ చేయకముందే అన్ని ఏర్పాట్లు చేసిపెట్టే వంటమనిషి, ఫోన్ కాల్ కొడితే పావురాల్లా వచ్చి పడకమీద వాలిపోయే గాళ్ ఫ్రెండ్స్! ఇక భార్యతో అవసరమేముంది... పెళ్లితో తీరవలసిన లోటేముంది''

''ఎందరిని ప్రేమించావ్?'' సూటిగా వచ్చిన ఆ ప్రశ్నకు ఖంగారుపడలేదతను.

''లెక్కగట్టలేవందరిని!'' తేలిగ్గా చెప్పిన అతని తీరు ఆమెను క్రమంగా కుదిపింది.

''ఎందరిని అమ్ముకున్నావ్?''

''ప్రేమించిన ప్రతి ఒక్కరిని'' పొగరుగా చెప్పాడు.

బిగుసుకుపోతున్న దవడ మూసుకుపోతున్న బలమైన పిడికిలి... ఆమెలో వచ్చే మార్పు అతనికి తెలుస్తూనే వుంది.

''నువ్వు ఆడే దాగుడుమూతలు ఆటలో ... నీ విజయానికి నువ్వు మురిసిపోతున్నావేమోగానీ విక్రమ్... ప్రేమ అనే రెండు అక్షరాల పదంతో, ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే నువ్వు... 'మోసపోయాను' అని తెలిసిన ఆడపిల్లలు ఆక్రందనతో పెట్టే శాపాలలో ఏ ఒక్కటైనా నిన్ను కబళించకపోదు! ఆడది ఆక్రోశనతో శాపిస్తే అది నీ పతనానికి అంకురార్పణ అని మరచిపోకు మిస్టర్ విక్రమ్''

ఆమెలోని ఆవేశానికి అతను వెకిలిగా నవ్వాడు.

''నీ కాలం చెల్లిపోయింది... నీ పతనం ప్రారంభయింది. ఇంకెంతో కాలం నీ మోసాలు సాగవు విక్రమ్. ఆడది అబలకాదని గుర్తుంచుకో... ఆగ్రహిస్తే ఆదిశక్తిని మరచిపోకు!'' ఆవేశంగా అంది.

''అడక్కుండానే రాత్రి పడకమీదికొచ్చావు. ఆదిశక్తివి కాబట్టా?!'' వెటకారంగా అడిగాడు.

అప్పుడు నవ్వింది సాధన. పగలబడి... విరగబడి. ఆశ్చర్యపోలేదు విక్రమ్. కాని అంతుబట్టలేదు ఆమెలో అకస్మాత్తుగా వచ్చిన మార్పుకు కారణమేమిటో!

''నేను వచ్చింది నీకు విందుచేద్దామనికాదు విక్రమ్... అంతకుమించి నీ మీద మనసుపడ్డది మోజుతోకాదు. నీ అంతానికి అంకురార్పణ జరపాలని!'' ఆమె కళ్లు కసిగా ఎర్రబారాయి.

''చంపుతావా? అయితే ఇదిగో...'' రాత్రిఖాళీచేసిన విస్కీబాటిల్ అందించాడు. కాని అతనిపై హత్యాప్రయత్నంచేయలేదు.

''నువ్వు మానవ మృగానివి. నిన్ను ఎలా అంతం చెయ్యాలో ఆలోచించి పెట్టాను. ఒకేసారి అంతమైపోయే అదృష్టాన్ని నీకిచ్చి నా మనసు పడే క్షోభకు అసంతృప్తిని మిగలనివ్వను విక్రమ్''

మృత్యువు నిన్ను ప్రతిక్షణం కబళించివేస్తుంటే... నువ్వు మోసం చేసిన ఆడపిల్లలు గుర్తొచ్చి, నీ పాపానికి ప్రాయశ్చిత్తం తెలియక అనుక్షణం కుళ్లి కుళ్లి చావాలి'' బ్యాగ్ భుజానికి వేసుకుంది సాధన వెళ్లేందుకు సిద్ధమవుతూ.

''మళ్లీ ఎప్పుడొస్తావ్?'' వెకిలిగా అడిగాడు విక్రమ్.

''బతికుంటే నువ్వు సగం కుళ్లిపోయా

క పరామర్శించేందుకు వస్తాను'' అంటూ ముందుకు కదిలింది.

గుమ్మం వరకు వెళ్లిన ఆమె క్షణం ఆగి మళ్లీ వెనక్కి వచ్చింది అతని దగ్గరగా!

''ఇంతకీ నేను నిన్ను వెతుక్కుంటూ వచ్చింది నువ్వు నన్ను మోసం చేసినందుకు, మనసిచ్చావని నిన్ను నేను నమ్మినందుకు... 'పతిత' తనానికి కూడా పనికిరానని డాక్టర్లు నాకు పట్టాని ప్రసాదించి 'ఎయిడ్స్ శాపగ్రస్తురాలని' బిరుదుని ప్రదానం చేశారు. అందుకు కారకుడవైన నిన్ను అభినందించి వెళ్దామని వెతుక్కుంటూ మరీ వచ్చాను'' బ్యాగ్‌లోంచి తీసిన కాగితాలని అతని ముఖం మీదకు విసిరి వెళ్లిపోయింది.

ఆమె అన్నదేమిటో అర్థంగాక అయోమయంగా చూశాడు ఆ కాగితాలని. అవి — ఆమె ఎయిడ్స్ వ్యాధికి గురైందని నిర్ధారిస్తూ డాక్టర్లు ఇచ్చిన టెస్ట్ రిపోర్ట్స్.

ఒక అణువిస్ఫోటనం జరిగిందక్కడ. అప్పుడు బోధపడింది విక్రమ్‌కు. రాత్రి సాధన అతని దగ్గర అంత చనువుగా ఎందుకు ప్రవర్తించిందో!

స్వేదంతో తడిసిన అతను మొదలునరికిన వృక్షంలా కూలిపోయాడు.

○ ● ○

